క్లుప్తంగా

జగనన్న సురక్ష సర్వే పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ

కంభం: మండలంలోని చిన్న కంభం సచివాలయం పరిధిలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను బుధవారం ఎంపీడీఓ ఎస్.ప్రసాద్‌బాబు పరిశీలించారు. అక్టోబర్ 3వ తేదీన సచివాలయంలో జరిగే మెడికల్ క్యాంపులో సర్వే ఆధారంగా స్పెషలిస్టు వైద్యులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈఓపీఆర్డీ విజయలక్ష్మి, కార్యదర్శి చుంచు సుధాకర్, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు




యూ.శ్రీనివాసరెడ్డి సీహెచ్.శ్రీనివాసరెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పిటికాయగుళ్ల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా పిటికాయగుళ్ల నుంచి మోటార్ సైకిల్‌పై ఉప్పలపాటి శ్రీనివాసరెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డిలు చెరువు వద్దకు వెళ్తున్నారు. బస్సును ఓవర్ టేక్ చేసే సమయంలో అక్కపల్లె నుంచి పిటికాయగుళ్ల వైపునకు వెళ్తున్న స్కూల్ వ్యాన్‌ను మోటార్ సైకిల్ ఢీకొట్టింది. ఉప్పలపాటి శ్రీనివాసరెడ్డి, చిలకల శ్రీనివాసరెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్కూల్ వ్యాన్‌లో కంభంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తీసుకెళ్లారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ కోటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

25 నుంచి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు



సమావేశానికి హాజరైన పీఈటీలు

మార్కాపురం టౌన్: ఈ నెల 25, 26, 27వ తేదీల్లో మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కోఆర్డినేటర్, పాఠశాల పీడీ ఎం.జాహ్నవి ప్రియ తెలిపారు. బుధవారం పాఠశాలలో సమీక్ష సమావేశం అనంతరం పోటీల వివరాలు వెల్లడించారు. మండల స్థాయిలో అండర్–14– అండర్–17 విభాగాల్లో ఎంపిక చేసిన జట్లను పోటీల్లో పాల్గొనేలా చూడాలని పీఈటీలు, పీడీలను కోరారు. సమావేశంలో పీఈటీలు మంత్రునాయక్, రమణయ్య, లక్ష్మీనారాయణ, రమేష్, శ్రీనివాసులు, బాబూరావు, శ్యామల, ఉమాకృష్ణ పాల్గొన్నారు.

జేఏఎస్ సర్వే విజయవంతం

బల్లికురవ: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతోందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ తెలిపారు. బుధవారం ఉప్పుమాగులూరు సచివాలయంలో సర్వేను పరిశీలించారు.

అన్నదాతలకు అండగా ప్రభుత్వ పథకాలు

చీరాల టౌన్: అన్నదాతలకు అండగా నిలవడంతో పాటుగా ఆపన్న హస్తం అందిస్తున్నదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలను ఆదుకుంటున్నారని వ్యవసాయ సలహామండలి చైర్మన్ కె.రమణారెడ్డి అన్నారు. బుధవారం కావూరివారిపాలెంలోని నక్కలవారిపాలెంలో స్ప్రింకర్ల కోసం దరఖాస్తు చేసుకున్న రైతులపంట భూములను ఆర్‌బీకే, వ్యవసాయ అధికారులు పరిశీలించారు. సలహామండలి చైర్మన్ మాట్లాడారు. డ్రిప్ ఇరిగేషన్ రాయితీ పరికరాలు కావాల్సిన వారు రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాస్ పుస్తకం, 1బి, తదితర దరఖాస్తులు అందించాలన్నారు. ఆర్‌బీకే అధికారి హిమేలియా, రైతులున్నారు.

నేడు వైఏ డిగ్రీ కాలేజీలో జాబ్‌మేళా

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో గురువారం జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సి.హెచ్ రమణమ్మ తెలిపారు. అమెజాన్ కంపెనీలో ప్రొడక్షన్ ఆపరేటర్స్, స్మార్ట్ మొబైల్ కంపెనీలో అసెంబ్లెర్లుగా పనిచేయడానికి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18–35 సంవత్సరాల వయస్సు లోపు మహిళల్లో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 10 గంటలకు జాబ్ మేళాకు హాజరు కావాలన్నారు.

ఘనంగా గణపయ్యకు వీడ్కోలు



మార్కాపురం : విఘ్నేశ్వర కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



పెద్దదోర్నాల: నిమజ్జనానికి తరలి వెళ్తున్న భ్రమరాంబ కళాశాల విగ్రహం

గిద్దలూరు రూరల్: వినాయక చవితి పండగ సందర్భంగా భక్తులు మండలంలోని అన్ని గ్రామాలు, పట్టణంలోని పలు వీధులల్లో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో బుధవారం వినాయకుడి విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని షరాబ్ బజారు స్వర్ణ గణపతి, కుమ్మరాంకట్ట సెంటర్‌లోని వినాయకుడి విగ్రహం వద్ద, పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద వస్త్ర గణపతి, యల్లావారి వీధి, నల్లబండ బజారు, రాజానగర్, రాచర్ల రోడ్డులోని వేంకటేశ్వరకాలని, ఎల్‌ఐసీ కార్యాలయం వీధి, పాతసత్యనారాయణ థియేటర్ వీధి, పాముల పల్లె రోడ్డు వంటి వీధుల్లో భక్తులు పెద్ద ఎత్తున వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వినాయకుడి విగ్రహాల నిమజ్జనానికి తరలించారు. పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాత సత్యనారాయణథియేటర్ వద్ద వినాయకుడి విగ్రహం వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటలో గంటా శ్రీనివాసులు, గంట రమణలు రూ.55.100 పాడి లడ్డూను గెలుపొందారు. విగ్రహాల నిమజ్జనం కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక సీఐ దేవప్రభాకర్, ఎస్‌ఐ మహేష్‌లు ప్రత్యేక బలగాలతో కట్టుదిట్ట ఏర్పాట్లు చేశారు. వినాయకుడి విగ్రహాలను కొండపేట ఆంజనేయస్వామి ఆలయం వెనుకాల ఉన్న సగిలేరు వాగు, రాచర్ల మండలం రామన్న కత్తువలకు తరలించారు.

బేస్తవారిపేట: మండలంలోని పందిళ్లపల్లె, పూసలపాడు, ఖాజీపురం, చెట్టిచర్ల, బేస్తవారిపేట, పెద్ద ఓబినేనిపల్లెలో బుధవారం గణనాథుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మూడు రోజులుగా ప్రత్యేక పందిళ్లలో పూజలందుకున్న వినాయక ప్రతిమలను తప్పెట్లు, మేళతాళాలతో ఊరేగింపుగా తరలించారు. బేస్తవారిపేట పరిసర ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను చీతిరేల కతువ, కంభం చెరువు, రామన్న కతువల వద్దకు నిమజ్జనానికి ట్రాక్టర్లపై తీసుకెళ్లారు.

పెద్దదోర్నాల: మండలంలోని పలు పలు ప్రాంతాల్లో ప్రతిష్టించిన వినాయకుడి విగ్రహాలు బుధవారం నిమ్మజ్జనాలకు తరలి వెళ్లాయి. పర్వదినం సందర్భంగా మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో గణేశ్ ప్రతిమలు ఏర్పాటు చేసి ఆది దేవునికి విఘ్నాలు తొలగి శుభాలు చేకూరాలంటూ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని భ్రమరాంబ డిగ్రీ కళాశాల కరెంట్ ఆఫీస్, మెట్టబజార్, కుమ్మరి కాలనీ, రజక వీధి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లాయి. కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అన్నదానం చేశారు. నిమజ్జనానికి తరలిన విగ్రహాలకు భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. విగ్రహాలను శ్రీశైలం ప్రాజెక్టు డ్యాం, బాపట్లలోని సూర్యలంక, కొత్తపట్నం బీచ్‌లకు నిమజ్జనాలకు తరలించారు. ఎస్‌ఐ అంకమరావు ప్రత్యేకంగా భద్రత ఏర్పాట్లు చేశారు.

కంభం: గణష్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం కంభం చెరువు కట్టపై వందకు పైగా వినాయకుడి విగ్రహాలను నిమజ్జనం చేయగా రెండో రోజు బుధవారం వివిధ గ్రామాల నుంచి వచ్చిన సుమారు 30పైగా విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండలంలోని కందులాపురంలో వినాయకుడి లడ్డూ వేలంపాట వేయగా నెమలిదిన్నె ఈశ్వర రెడ్డి రూ.40 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నాడు. గ్రామోత్సవంగా కంభం చెరువు కట్టకు వెళ్లి నిమజ్జన వేడుకలు నిర్వహించారు. కంభం చెరువు కట్టపై పోలీసులు పటిష్ట బందోబస్తుతో పాటు గజఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

కొమరోలు: మండలంలో మూడు రోజులుగా వినాయక చవితి వేడుకలు నిర్వహించిన అనంతరం నిమజ్జన వేడుకలను బుధవారం వైభవంగా జరిపారు. మండలంలోని పలు గ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలకు పూజలు చేశారు. చెరువుల్లో వినాయకుని విగ్రహాలను వేడుకగా నిమజ్జనం చేశారు. కొమరోలులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వెలసిన వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద లడ్డూ ప్రసాదాన్ని షేక్ ఖాజావలి 36 వేల రూపాయలకు వేలం పాట పాడి దక్కించుకున్నారు. తాతిరెడ్డిపల్లె గ్రామంలో కొమ్మలపాటి ఆదెయ్య రూ.50 వేలకు లడ్డూ వేలంపాట పాడి దక్కించుకున్నారు.

కురిచేడు: వినాయకచవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు వీడ్కోలు పలుకుతున్నారు. గంగమ్మచెంతకు చేర్చి నిమజ్జనం చేస్తున్నారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో సోమవారం గ్రామోత్సవం నిర్వహించారు. యువకులు, మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం నిమజ్జనం చేసి గణపయ్యకు ఘనంగా వీడ్కోలు పలికారు. కారు డ్రైవర్లు ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహానికి కూడా గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వర కల్యాణం

మార్కాపురం/మార్కాపురం రూరల్/కొనకనమిట్ల/తర్లుపాడు: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని వివిధ ప్రాంతాల్లోని వినాయక మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద భక్తులు బుధవారం పూజలు చేశారు. రాజాజీ వీధిలో విఘ్నేశ్వర మండపం వద్ద బుధవారం స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నెహ్రూ బజారులో విఘ్నేశ్వరస్వామి విగ్రహం వద్ద వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ మండలంలోని నాగులవరం, దరిమడుగు, గొట్టిపడియ, గజ్జలకొండ, తిప్పాయిపాలెం, రాయవరం, నికరంపల్లి గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. నాగులవరం గ్రామంలో మార్కాపురం మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. పలు గ్రామాల్లో భక్తులకు అన్నదానం చేశారు.

కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు, నాయుడుపేట, వెలుగొండ్రాయునిపల్లి, చినారికట్ల, గ్రామాల్లో గణేశ్ విగ్రహాలను కోలాహలం మధ్య నిమజ్జనానికి తరలించారు. చిన్నారులు, యువత, మహిళలు గులాం చల్లుకుంటూ ఉత్సాహంగా నిమజ్జనంలో పాల్గొన్నారు.

తర్లుపాడు మండలంలోని గణనాథుడి మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల భక్తులకు అన్నదానం చేశారు. మూడు రోజులుగా పూజలందుకున్న గణపతి విగ్రహాల నిమజ్జనం కోలాహలంగా నిర్వహించారు.



కంభం: కందులాపురంలో లడ్డూ వేలం పాట



కొమరోలు: వేలంపాటలో లడ్డూను దక్కించుకున్న ఖాజావలి



కురిచేడు: గణనాథుని గ్రామోత్సవంలో యువకుల నృత్యాలు



కురిచేడు: నృత్యం చేస్తున్న యువతులు



గిద్దలూరు: వినాయకుడి నిమజ్జనం కార్యక్రమంలో భక్తులు



నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథుడు



మార్కాపురం : పూజల్లో పాల్గొన్న జంకె వెంకటరెడ్డి



గొట్లగట్టులో..



నాగులవరంలో కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

ఉడుముల ఆదిలక్ష్మమ్మకు ఘన నివాళి

- హాజరైన ఎమ్మెల్యేలు కేపీ, బలరాం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె



చినారికట్లలో ఆదిలక్ష్మమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి మాతృమూర్తి ఉడుముల ఆదిలక్ష్మమ్మ(92) దశదిన కర్మను కొనకనమిట్ల మండలంలోని చినారికట్ల గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి పాల్గొని ఆదిలక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదిలక్ష్మమ్మ భర్త దివంగత మాజీ ఎమ్మెల్యే ఉడుముల వెంకటరెడ్డి పశ్చిమ ప్రాంత అభివృద్ధికి తనవంతు కృషి చేశారని కొనియాడారు. ఆదిలక్ష్మమ్మ కుమారుడు ఉడుముల శ్రీనివాసులరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎమ్మెల్యేలు ముక్కు కాశిరెడ్డి, ఉగ్ర నరసింహారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా హనుమారెడ్డి, షంషీర్ ఆలీబేగ్, పారిశ్రామికవేత్త ఉడుముల లక్ష్మీనారాయణరెడ్డి, పీడీసీసీబీ చైర్మన్ వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, సాని కొమ్ము శ్రీనివాసులరెడ్డి, కేపీ రమణారెడ్డి, మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్ ఇస్మాయిల్, కొనకనమిట్ల, మర్రిపూడి, తర్లుపాడు, వెలిగండ్ల, మండలాల ఎంపీపీలు మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, వాకా వెంకటరెడ్డి, సూరెడ్డి భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, రామలక్ష్మమ్మ, కొనకనమిట్ల, తర్లుపాడు, వెలిగండ్ల మండల జెడ్పీటీసీలు అక్కిదాసరి ఏడుకొండలు, వెన్నా ఇందిర హనుమారెడ్డి, గుంటక తిరుపతిరెడ్డి, సొసైటీ చైర్మన్లు కామసాని వెంకటేశ్వరరెడ్డి, ఉడుముల కాశిరెడ్డి, మార్కాపురం, యర్రగొండపాలెం మార్కెట్ యార్డ్ చైర్మన్లు గొలమారి శ్రీనివాసులరెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మెట్టు వెంకటరెడ్డి, సాయిరాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు మోరా శంకర్‌రెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసులరెడ్డి, పార్టీ నాయకులు కల్లం సుబ్బారెడ్డి గొలమారి చెన్నారెడ్డి, గుర్రపుశాల శ్రీనివాసులు, మండలపు శ్రీనివాసులరెడ్డి, చినారికట్ల సర్పంచ్ జి.అనురాధ వెలుగొండయ్య, ఎంపీటీసీ ఉడుముల ధనలక్ష్మి బంగారురెడ్డి, పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉడుముల అభిమానులు ఉన్నారు.

పందుల బెడద నుంచి మొక్కజొన్నను కాపాడుకోవాలి

తాళ్లూరు (ముండ్లమూరు): రైతులు సాగుచేసిన మొక్కజొన్న పైరు ప్రస్తుతం పాలుపోసుకునే దశలో ఉన్నందున పందుల బెడద నుంచి కాపాడుకోవాలని ఏఓ ప్రసాదరావు సూచించారు. మండలంలోని కొత్తపాలెం గ్రామంలో మొక్కజొన్న పైరును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారన్నారు. పైరు కండె పాలుపోసుకునే సమయంలో పందుల బెడద ఎక్కువగా ఉంటుందన్నారు. వాటి నుంచి పంటను కాపాడుకునేందుకు వైరుతో అల్లిన వలలను చేను చుట్టూ ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాత చీరలను కర్రలకు గట్టిగా కట్టి చేను చుట్టూ ఏర్పాటు చేయాలన్నారు. కత్తెర షాపులోని వెంట్రుకలను పైరుకు దగ్గరగా అక్కడక్కడా వేస్తే.. ఆ వాసనకు పందులు దరిచేరవన్నారు. ఆయన వెంట వీఏఏ నాగరాజునాయక్, ఏఈఓ నాగరాజు, రైతులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైన కొమరోలు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ ఎస్తేర్ మేరీ, పీఈటీ సతీష్

కొమరోలు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడంతో పలువురు అభినందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో షేక్ ఖాజారహంతుల్లా డిస్కస్ త్రో, షాట్‌పుట్ త్రోలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన అండర్–18 విభాగంలో పోటీలు నిర్వహించారు. కిశోర్ 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కాగా ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న ఎంవీ అనుప్రియ 100 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. శ్రీకాంత్ 2 వేల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. భరత్ 100 మీటర్ల పరుగు పందెంలో లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానంలో నిలువగా ఎం.శ్రీచరణ్ హైజంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ ఎస్తేర్ మేరి తెలిపారు. వీరు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



విద్యార్థి వెంకటేశ్వర్లుతో ఉపాధ్యాయులు

పెద్దారవీడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి వి.వెంకటేశ్వర్లు రాష్ట్రస్థాయిలో బాల్‌బ్యాడ్మింటన్ ఆడేందుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కనకదుర్గ బుధవారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో విజయం సాధించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లాలోని చేవూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 17వ తేదీన నిర్వహించిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయిలో ఆడేందుకు బాల్‌బ్యాడ్మింటన్‌లో ప్రతిభ కనబరచారని, చిత్తూరు జిల్లాలో త్వరలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని పీడీ పి. దామోదరరెడ్డి పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థి వెంకటేశ్వర్లును ఎస్‌ఎంసీ చైర్మన్ అల్లు లక్ష్మీగోవిందరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు



కృష్ణారెడ్డి సంతాప సభలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

- ఘన నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ నాయకులు

కొనకనమిట్ల: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పొదిలి మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్, వెలిగండ్ల గ్రామ మాజీ సర్పంచ్ పాతకోట వెంకటకృష్ణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తుల బ్రహ్మానందరెడ్డి, మార్కాపురం, చీరాల ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెలిగండ్ల గ్రామంలో కృష్ణారెడ్డి దశదిశ కర్మ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో వారు పాల్గొన్నారు. కృష్ణారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 50 ఏళ్లుగా కృష్ణారెడ్డి కుటుంబం రాజకీయాల్లో ఉంటూ సేవా కార్యక్రమాలు చేపట్టిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానిగా ఉంటూ పార్టీకి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కృష్ణారెడ్డి కుమార్తె చీరాల ఆర్డీఓ సరోజిని, ఆయన వారసుడు, సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డిని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, అద్దంకి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, పీసీసీ అధికార ప్రతినిధి షేక్ సైదా, మాజీ ఎమ్మెల్యేలు పాపారావు, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ గర్రె శ్రీనివాసులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కృష్ణారెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేసుకోండి



ఈ-క్రాప్ వివరాలు పరిశీలిస్తున్న జేడీఏ శ్రీనివాసరావు



గోరుగుంతలపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ

తర్లుపాడు: ఈనెల 30వ తేదీతో ఖరీఫ్ సీజన్ ఈ క్రాప్ నమోదు ముగుస్తుందని రైతులు తమ పంటల వివరాలు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 3,808 ఎకరాలు మాత్రమే ఈ క్రాప్‌లో నమోదు చేసినట్లు వెల్లడించారు. బుధవారం మండలంలోని గోరుగుంతలపాడులో పత్తి, కంది పంటలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. పత్తిలో పచ్చదోమ నివారణకు థయోమిథాక్సమ్ 25 డబ్ల్యుజీ 0.2 గ్రాములు, ఇమిడాక్లోప్రిడ్ 17.8 ఎస్ఎల్ 0.4 మి.లీ మందును పిచికారీ చేయాలన్నారు. కందిలో మిడత మొక్కల కత్తిరింపు నివారణకు క్లోరోపైరిఫాస్ 20ఈసీ అర లీటరు లేదా 50 ఈసీ 300 మి.లీ మందును ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు.

పంటల నమోదు తనిఖీ

పొదిలి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు సంబంధించి ఈ క్రాప్ నమోదు ప్రక్రియను జిల్లా అధికారులు బుధవారం తనిఖీ చేశారు. పొదిలి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 107–1లో పోతురాజు వెంకటేశ్వర్లు అనే రైతు సజ్జ, కంది అంతర పంటగా సాగు చేశారు. ఆ పంటలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్.శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జేడీఏ మాట్లాడుతూ.. పంటల నమోదు పారదర్శకంగా చేపడుతున్నట్లు తెలిపారు. కంకి దశలో ఉన్న సజ్జ పైరుకు శనగపచ్చ పురుగు ఆశించిందని, నివారణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జైనులాబ్దిన్ సూచించారు.

సమస్యలు పరిష్కరించాలి

ముండ్లమూరు: గ్రామాల్లో ప్రజల నుంచి సమస్యలపై వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీఓ హనుమంతరావు సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పందన ద్వారా వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటి సర్వే చేస్తున్నందున ఆరోగ్య సిబ్బందికి అన్ని విధాలా సహకరించాలన్నారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

ఈ-పంట నమోదు

జె. పంగులూరు: మండల పరిధిలోని బూదవాడలో బుధవారం ఈ- పంట నమోదు కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి సుబ్బరెడ్డి కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏఓ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఈ- పంట నమోదు చేసుకోవటం వలన ఉచిత పంటల బీమా పథకం, పంటకొనుగోలు కేంద్రాల్లో అమ్ముకొనుటకు, ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగినప్పుడు సున్నావడ్డీ పథకానికిప్రామాణికం గా తీసుకోవచ్చన్నారు.